క్లుప్తంగా

గ్రాహం స్టేయిన్ సేవలు మరువలేనివి



మన్నాచర్చిలో నివాళులర్పిస్తున్న దుర్గం ప్రభాకర్, తదితరులు

భానుపురి : కుష్టువ్యాధిగ్రస్తులకు గ్రాహం స్టేయిన్ చేసిన సేవలు మరువలేనివని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మన్నాచర్చిలో గ్రాహం స్టేయిన్ 25వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేయిన్, ఆయన కుమారులు ఫిలిఫ్, తిమోతిల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. ఒడిశాలో మయూర్‌భంజ్ లెప్రసీ హోమ్ సువార్త మిషనరీ సంస్థ ద్వారా కుష్టువ్యాధిగ్రస్తులకు గ్రాహం స్టేయిన్ సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. 1999 జనవరి 23వ తేదీన జీపులో నిద్రిస్తున్న గ్రాహం స్టేయిన్, అతని ఇద్దరు కుమారులను గుర్తు తెలియని దుండుగులు నిప్పంటించి సజీవ దహనం చేశారని, ఈ ఘటన భారతదేశ చరిత్రలోనే అత్యంత క్రూరమైందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సీహెచ్. సాల్మన్ రాజు, గౌరవ సలహాదారులు పి.మార్క్, యం.హాజర్య, ఆర్.రూబెన్, నియోజకవర్గ అధ్యక్షుడు బొక్క ఏలీయా రాజు, టౌన్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లు జాన్ పాల్, ట్రెజరర్ ఆర్. స్పర్జన్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ఫిలిఫ్, పాల్వాయి కోర్నెలి, జలగం జేమ్స్, క్రిష్టాపాల్, యల్క ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమేష్‌చారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక శాసన సభ్యుడు మందుల సామేల్ హాజరవుతారని తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన నగిరే జగదీష్ కుమార్తె నగిరే తనుశ్రీ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని బాధితురాలి తండ్రి నగిరే జగదీష్ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బాధితురాలి చికిత్స కోసం రూ.3లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మొరపాక సత్యం మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎస్‌కే.రజాక్ పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలి

నడిగూడెం : సాగర్ నీటిని విడుదల చేయాలని రైతు సంఘం నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రామాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయకట్టు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో బోర్లు, బావుల కింద రైతులు వరి సాగు చేపట్టారని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గడంతో నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. మంగళవారం కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడేలా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు దేవరకొండ జనార్దన్ మాట్లాడారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కస్తూరి చరణ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ఫౌండేషన్ తరఫున సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కంచర్ల రామకృష్ణ, ఎల్కపల్లి మహేష్, మన్నె శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి, కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో..

- సూర్యాపేట పట్టణంలోని కుడకుడ రోడ్డులో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారుల ఇక్కట్లు
- రహదారిని విస్తరించాలని డిమాండ్





సూర్యాపేట - దంతాలపల్లి రహదారిపై వెళ్తున్న వాహనాలు

భానుపురి : సూర్యాపేట పట్టణం రోజురోజుకూ వేగంగా విస్తరిస్తోంది. ప్రధానంగా జిల్లాకేంద్రంగా మారిన తర్వాత పేట రూపురేఖలు మారిపోయాయి. ఇందులోనూ పట్టణం నుంచి దంతాలపల్లి రోడ్డుకు వెళ్లే ప్రాంతమంతా రద్దీగా మారింది. జాతీయ రహదారి విస్తరణ అనంతరం పట్టణం రెండుభాగాలుగా మారినట్లుగా ఫ్లెఓవర్ బ్రిడ్జి వెళ్లడంతో కుడకుడ వైపు ఉన్న ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో ఏ చిన్న వస్తువు కోసమైనా జాతీయ రహదారిని దాటి వెళ్లే పరిస్థితి ఉండగా.. ప్రస్తుతం షాపింగ్ మాళ్ల నుంచి పెద్దపెద్ద షోరూంలు సైతం ఇటువైపే ఉన్నాయి. ఇక అపార్ట్‌మెంట్లు, కాలనీలు, టౌన్‌షిప్‌లు సైతం పెరిగిపోవడంతో పట్టణానికి అతి సమీపంలో ఉన్నటువంటి కుడకుడ గ్రామం సూర్యాపేట మున్సిపాలిటీలో విలీనమైంది. ప్రస్తుతం ఈ గ్రామాన్ని సైతం దాటుకుని పట్టణ విస్తీర్ణం పెరుగుతోంది.

భారీగా పెరిగిన ట్రాఫిక్..

ఈ నేపథ్యంలో సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై ఐలాపురం స్టేజీ వరకు ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ప్రధానంగా కుడకుడ గ్రామశివారులోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్ వరకు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయి. ఉదయం నుంచి రాత్రి 9గంటల వరకు సూర్యాపేట-దంతాలపల్లి రహదారికి రద్దీ ఉంటుంది. ఈ సమయాల్లో నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్ (ఎస్) మండలాల నుంచి ప్రజలు, ఉద్యోగులు జిల్లాకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం భారీగా రాకపోకలు సాగిస్తుంటారు. రెండు జిల్లాలను కలిపే రహదారి కావడంతో ఆర్టీసీ బస్సులు, లారీలు అధికంగా ప్రయాణిస్తుంటాయి. ఈ విధంగా వాహనాల రద్దీ పెరుగుతుండడం, రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇంత రద్దీగా ఉండే సూర్యాపేట-దంతాలపల్లి ఆర్‌అండ్‌బీ రహదారిని జాతీయ రహదారి నుంచి కేవలం 100మీటర్ల లోపు మాత్రమే డివైడర్‌తో విస్తరించారు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు ఈ రహదారిని ఐలాపురం శివారు వరకు విస్తరించాలని, కుడకుడ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు డివైడర్‌ను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

డివైడర్ నిర్మించాలి



“ కొత్త బస్టాండు నుంచి కుడకుడ వెళ్లే రహదారి కొంత కాలంగా రద్దీగా మారింది. వాహనాలు ఎక్కువగా వస్తున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త బస్టాండు నుంచి కుడకుడ శివారు వరకు రహదారిని విస్తరించి డివైడర్ నిర్మించాలి.

\- సోమిరెడ్డి వీరారెడ్డి, వాహనదారుడు

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి



“ కొత్త బస్టాండ్ నుంచి దంతాలపల్లి రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ పెరిగి ఇబ్బందులు అవుతున్నాయి. రహదారిని విస్తరించి డివైడర్‌ను నిర్మిస్తే ఇబ్బందులు ఉండవు.

\- ఉపేందర్, పట్టణవాసుడు

గణిత టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ



సూర్యాపేటరూరల్ : ప్రశంసా పత్రాలతో విద్యార్థులు



ఆత్మకూరులో..

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్టు 2023-24లో ఇమాంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతిని కైవసం చేసుకొని జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులు ఎం.మనోజ్, కె.వర్షిత్‌లను ఆయన అభినందించారు. మండల స్థాయిలో ఎంపికైన ఈ విద్యార్థులు ఈ నెల 27న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు 29మంది విద్యార్థులు హాజరు కాగా పదవ తరగతి నుంచి తెలుగు మీడియంలో ఇస్తాళాపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జి వంశీ, కస్తూరిబా గాంధీ పాఠశాలకు చెందిన బి.మానస ప్రతిభ కనబరిచారు. అలాగే పదవ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.శ్రీజ, ఏపూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కే.చరణ్, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల నుంచి పి.తామోరెడ్డి, వంశీ ప్రతిభ కనబరిచారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి గణిత టాలెంట్ పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. తెలుగు విభాగంలో జెడ్పీహెచ్ఎస్ అన్నారం విద్యార్థి మహేష్‌బాబు, జెడ్పీహెచ్ఎస్ పెన్‌పహాడ్ విద్యార్థి శ్రీరాం, ఇంగ్లిష్ విభాగంలో జెడ్పీహెచ్ఎస్ పెన్‌పహాడ్ విద్యార్థిని దివ్య, జెడ్పీహెచ్ఎస్ పెన్‌పహాడ్ విద్యార్థిని ఆకాంక్ష, అలాగే ఆదర్శ పాఠశాల అనాజిపురం నుంచి హర్షవర్ధన్, వంశిక మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీనివాస్, శేఖర్, భిక్షం, రఫీయా తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మండల స్థాయిలో గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. తాళ్లసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొడ్డు బంగారులక్ష్మి ప్రథమ బహుమతి, పాతులోతు హారిక ద్వితీయ బహుమతి సాధించినట్లు ఎంఈఓ రాములు నాయక్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ రాములు నాయక్



పెన్‌పహాడ్ : విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి

పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు

సూర్యాపేట రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శాస్త్ర పాఠశాల చైర్మన్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణ పరిధిలోని రాయినిగూడెం గ్రామ సమీపంలోని శాస్త్ర పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కరుణరావు, పుష్పలత, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : దేశం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు మరువలేనివని రిటైర్డు ఉపాధ్యాయుడు ఓరుగంటి సత్యనారాయణ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యాకయ్య, ఉపాధ్యాయులు ఎర్ర హరికిషన్, గుజ్జ భాస్కర్, వీరన్న, శ్రీకాంత్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట రూరల్ : శాస్త్ర పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న చైర్మన్ ఎం.చంద్రశేఖర్



తుంగతుర్తిలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న రిటైర్డు ఉపాధ్యాయుడు

సైబర్ నేరాలపై పోలీసుల కళాజాతా

మునగాల : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మునగాల ఏఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం మునగాల మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా, డ్రగ్స్, మత్తు మందులు, గంజాయి నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటీపీ ఫ్రాడ్స్, టోల్‌ఫ్రీ నంబర్ 1930, సెల్‌ఫోన్ల వల్ల కలిగే అనర్థాలు, షీటీమ్స్, మహిళల భద్రత, పిల్లలపైన సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆట పాటల ద్వారా విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, సిబ్బంది నిరంజన్, ఉపాధ్యాయులు, పోలీసు కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ పాల్గొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేయాలని వినతి



హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న వీరమల్లు

నాగారం : ఫణిగిరి సీతారామచంద్ర స్వామి ఆలయ భూములను పరిరక్షించి, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పులిగిల్ల వీరమల్లు యాదవ్ మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఫణిగిరి గుట్ట వద్ద సీతారామచంద్రస్వామి ఆలయం, గుట్టపై రాష్ట్రంలోనే ప్రఖ్యాతి చెందిన బౌద్ధక్షేత్రం ఉందని తెలిపారు. ఫణిగిరిలోని రామాలయాన్ని, బౌద్ధక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా మారి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆశయాలను సాధించాలి



భానుపురి : నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మిత్రమండలి సభ్యులు



అర్వపల్లిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక

భానుపురి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూర్యాపేట పూర్వమిత్రమండలి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సూర్యాపేట పూర్వమిత్రమండలి కార్యాలయంలో నిర్వహించిన సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు వై.నర్సయ్య, సహాయ కార్యదర్శి షేక్ సైదులు, సభ్యులు షేక్ మదీనాబీ, చొల్లేటి ఉపేంద్రాచారి, అప్పారావు, నజీర్‌పాషా, వెంకటేశం, దాసరి సత్యనారాయణ, రాంరెడ్డి, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మల్లేష్, ఈసీ నగేష్, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతినిధులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ వంగూరి రమేష్, సర్పంచ్ కస్తూరి రాణి శ్రీనివాస్‌రెడ్డి, పచ్చిపాల వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ బోనగిరి సీతరాములు, తీకుల సుధాకర్‌రెడ్డి, ఏఎన్‌ఎం, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను నిరసిస్తూ 16న బంద్



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

చివ్వెంల : బీజేపీ శ్రామిక వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాము వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక, పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా దెబ్బతీసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు, వ్యవసాయ కూలీలు, హమాలీ రంగం, వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులు తమ ఉపాధి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసే చట్టాలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమలో యేసు, అమ్మయ్య, నవీన్, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది



సూర్యాపేటటౌన్ : పేటలోని జూనియర్ కాలేజీలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



సూర్యాపేటటౌన్ : క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ



తుంగతుర్తిలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందిస్తున్న తహసీల్దార్

సూర్యాపేటటౌన్ : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ సీహెచ్.కృష్ణయ్య అన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఎల్‌ఓలు, ఉద్యోగులకు నియోజకవర్గ స్థాయి రంగోళి, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఈ నెల 26న పరేడ్ గ్రౌండ్‌లో రిపబ్లిక్‌డే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆర్ఐ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు విలువ వెలకట్టలేనిది

తుంగతుర్తి : ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనదని, ఓటు విలువ వెలకట్టలేనిదని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. అనంతరం తుంగతుర్తిలోని జెడ్పీహెచ్ఎస్‌లో యువతకు కబడ్డీ పోటీలు, మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, డీటీ హరిశ్చంద్రప్రసాద్, హెచ్‌ఎం యాకయ్య, ఏపీఎం నర్సయ్య, ఉపాధ్యాయులు భాస్కర్, హరికిషన్, రాజన్న, అల్లావుద్దీన్, నర్మద, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన దొంగ

సూర్యాపేట క్రైం : దుకాణంలో దొంగతనం చేస్తూ పట్టుబడిన వ్యక్తిని దుకాణ నిర్వాహకులు స్తంభానికి కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో మంగళవారం జరిగింది. వివరాలు.. ఎంజీ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి అశ్విని స్టీల్ దుకాణంలో ఓ దొంగ కుక్కర్ దొంగతనం చేయబోతుండగా.. దుకాణ నిర్వాహకులు పట్టుకొని స్తంభానికి కట్టేసి ఉంచారు. దుకాణ నిర్వాహకుడు దేవరశెట్టి వేణు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు దొంగను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో సూర్యాపేటలో జరిగే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండ వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పద్మశాలీ భవనంలో జరిగిన సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అప్పగించి రైతులకు, కార్మికులకు, మధ్యతరగతి ప్రజలకు అన్యాయం చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పడం ద్వారా నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మతం పేరుతో బీజేపీ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు, కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, విష్ణుమూర్తి, దేవరాజ్, సోమయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండ వెంకట్‌రెడ్డి

25నుంచి మహబూబా దర్గా ఉర్సు



దూపహాడ్‌లో ముస్తాబైన మహబూబా దర్గా



నాగదేవత పుట్ట

- 27వరకు జరగనున్న వేడుకలు
- పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులు

పెన్‌పహాడ్ : దూపహాడ్ గ్రామంలో ఈ నెల 25నుంచి మహబూబా దర్గా ఉర్సు జరగనుంది. ప్రతి సంవత్సరం జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభమైన రోజు నుంచి దూపహాడ్‌లో కూడా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించబడుతాయి. దూపహాడ్‌లోని మహబూబా దర్గా ఉర్సును ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోపగాని చిన వెంకటేశం, గోపగాని సందీప్‌లు తెలిపారు.

మహబూబా దర్గా ఉర్సు చరిత్ర...

దూపహాడ్ గ్రామానికి చెందిన గోపగాని చిన వెంకటేశం, లక్ష్మమ్మ దంపతుల కూతురు మహబూబా అనారోగ్యంతో పదకొండవ సంవత్సరంలో మృతి చెందింది. అయితే మహబూబా తన తల్లిదండ్రులకు కలలో వచ్చి దైవంగా మారానని, దర్గా నిర్మించాలని కోరడంతో దర్గా ఏర్పాటు చేశారు. మహబూబాకు దర్గాతో పాటు 1996లోనే ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి 20 సంవత్సరాలుగా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. సంతానం లేనివారు, అనారోగ్య బాధితులు, కోర్కెలు తీరిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఉర్సు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ఉర్సుకు జాన్‌పహాడ్ దర్గా నుంచి గంధంను ఊరేగింపుగా తీసుకువస్తారు. అదే రోజు రాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మునగాల, గరిడేపల్లి, నేరేడుచర్ల, పెన్‌పహాడ్, హుజూర్‌నగర్, సూర్యాపేట, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. నాగ దేవత పుట్ట కూడా ఇక్కడ ప్రత్యేకంగా వెలిసింది. భక్తులు దర్గా ఉర్సు వేడుకల్లో పాల్గొనడంతోపాటు నాగదేవతకు కూడా పూజలు చేస్తారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులను ప్రదానం చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : గ్రామీణ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు అన్నారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సంకినేని రామారావు, కమలమ్మల జ్ఞాపకార్థం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడల ద్వారా యువకుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. విజేతలకు సంకినేని కృష్ణారావు బ్రదర్స్ సహకారంతో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు, నాయకులు గాజుల మహేందర్, ఉప్పుల లింగయ్య, అంబటి రమేష్, వేణు, నాగరాజు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.